ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 23 జూలై 2025



ప్లాస్టిక్ వాడకం హానికరం

● కాలుష్య నియంత్రణ సంస్థ చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య



మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య

కడప కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం హానికరమని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ సంస్థ చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూము హాల్లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ అధ్యక్షతన జిల్లాలో ప్లాస్టిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, నివారణపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌ల మందం కనీసం 75 మైక్రాన్‌లకు తక్కువ ఉన్నవి వినియోగించరాదని సూచించారు. ప్రధానంగా జిల్లాలోని అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి జిల్లాలో పంచాయతీ అధికారులు, ప్లాస్టిక్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పక్కాగా డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణపై అధికారులతో పాటు సచివాలయ సిబ్బందిని భాగస్వాములు చేసి ప్రజల్లో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉన్నందున వీటి వల్ల వచ్చే వ్యర్థ పదార్థాలతో కాలుష్యం రాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకం అరికట్టేందుకు ప్రధానంగా బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు చేపట్టాలన్నారు. మార్కెట్లలో హోల్ సేల్ షాపులను తనిఖీ చేసి జరిమానాలు విధించాలని ఆదేశించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించి చర్యలు చేపడుతున్నామన్నారు. ప్లాసిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుధ, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాష, జెడ్ఎం శ్రీనివాసమూర్తి, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రూ.3కోట్ల ప్రభుత్వ భూమికి విముక్తి

కడప, జూలై 22(ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని చింతకొమ్మదిన్నె మండలంలో వైసీపీ నేత ఆధీనంలో ఉన్న సుమారు రూ.3కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమికి విముక్తి కలిగింది. జగన్ హయాంలో వైసీపీకి చెందిన ఓ కార్పొరేటరు, సీకేదిన్నె మండలంలోని రెవెన్యూ పొలం సర్వే నెం.1222లో ఉన్న 0.50 సెంట్లు వంక పోరంబోకు కాల్వ స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్ వేశారు. దీనిపై అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవలే ఆంధ్రజ్యోతిలో భూకబ్జాలపై కథనం ప్రచురితమైంది. కలెక్టరు డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దారు నాగేశ్వర్‌రావు ప్రభుత్వ స్థలంలో వేసిన లేఅవుట్‌ను కూలగొట్టి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. రూ.3కోట్లు విలువ చేసే స్థలం వైసీపీ చెర నుంచి విడిపించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ స్థలంలో లేఅవుట్లను కూల్చివేసిన అధికారులు

అందుబాటులో 2900 టన్నుల ఎరువులు

● కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్సులు రద్దు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతాంగానికి పంటల సాగుకు సంబంధించిన 2900 టన్నుల ఎరువులు రైతు స్టోరేజీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం కలెక్టర్ చాంబరులో ఎరువుల నిల్వలు, విక్రయాలు, మార్కెటింగ్, పంటలు తదితర అంశాలపై వ్యవసాయ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, డీఎస్‌ఓ శాఖల అధికారులు, ప్రైవేట్ ఎరువుల కంపెనీల ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు స్టోరేజీలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల డిమాండ్ మేరకు ఎరువులను అందజేస్తామని, వాటిని రైతులు వినియోగించుకోవాలన్నారు. ప్రైవేట్ ఎరువుల డీలర్స్ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ ఈ పాస్ యంత్రాల ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. బల్క్ స్టాక్ పెట్టుకొని కృతిమ కొరత సృష్టిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని మార్కెట్ యార్డులలో పంటల మార్కెట్ ధరలను ఉదయం 7 గంటలకే డిస్‌ప్లే బోర్డుల ద్వారా తెలియజేయాలని, దళారీల పెత్తనంపై నిఘా పెంచి చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పండించే పంటల వారీగా వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి అవసరమైన వివరాలను సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్, మార్కెటింగ్ ఏడీ అజాద్‌వల్లి, మార్క్‌ఫెడ్ డీఎం, పరిమళజ్యోతి, హార్టికల్చర్ అధికారి, డీసీవో వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సౌమ్యనాథుడి హుండీ ఆదాయం రూ.6.06 లక్షలు

నందలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి ఆలయం హుండీని మంగళవారం లెక్కించగా రూ.6,06,780 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీని 40 రోజులకు సంబంధించి లెక్కించామన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన్, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టు డిపాజిట్లు రూ.2.24 కోట్లు

సౌమ్యనాథస్వామి అన్నదాన ట్రస్టు డిపాజిట్లు బ్యాంకు ఖాతాలో రూ.2,24,13,591 ఉన్నట్లు ట్రస్టు అధ్యక్షుడు ఎద్దల సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం సౌమ్యనాథస్వామి అన్నదాన ట్రస్టు బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శనివారం, ఆదివారం అన్నదానం చేస్తున్నామని, మరొక రోజు కూడా భక్తులకు భోజనాలు ఏర్పాటు చేసేందుకు తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి శైలేంద్రనాథ్, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలే టార్గెట్





ఈజీ మనీ కోసం యువత పెడదారి పడుతున్నారు. జల్సాలకు అలవాటుపడి చెడుమార్గంలో పయనిస్తున్నారు. కష్టపడి సంపాదించడం చేతకాక.. ఎదుటి వారిని బురిడీ కొట్టించడమే సులువుగా ఎంచుకున్నారు. ఈ క్రమంలోనే ఒంటరి మహిళలు, వృద్ధులే టార్గెట్‌గా పెట్టుకొని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాలు, పోలీసులు లేని ప్రాంతాలను ఎంచుకొని తమ చేతివాటాన్ని చూపుతూ.. వచ్చిన సొమ్ముతో ఎంజాయ్ చేస్తున్నారు. వీటి నివారణకు అప్రమత్తతే ముఖ్యమని పోలీసులు మహిళలకు సూచిస్తున్నారు.



● ఈజీ మనీ కోసం తెంచేస్తున్నారు

● జిల్లాలో పెరుగుతున్న గొలుసు దొంగతనాలు

● జల్సాల కోసం తప్పుదారి పడుతున్న యువత

కడప క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చైన్ స్నాచింగ్‌లు ఎక్కువయ్యాయి. ఒంటరి మహిళలను టార్గెట్‌గా చేసుకొని ఈజీమనీకి అలవాటుపడిన వారు ఎక్కువయ్యారు. కొంతమంది యువత వారు చేసే పనిలో ఆదాయం లేకపోవడం.. జల్సాలకు అలవాటు పడడం.. కుటుంబ భారం ఎక్కువవడం.. వెరశి యువత చెడుమార్గంలో పయనిస్తున్నారు. ఒక బంగారు గొలుసును కొట్టేస్తే లక్షలాది రూపాయలు డబ్బులు వస్తాయనే ఉద్దేశ్యంతో కొందరు చోరీ బాటలో వెళుతున్నారు. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో తిరుగుతూ సీసీ కెమెరాలు, పోలీసు, ప్రజలు తిరగని ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. కొందరు ఇంటర్, డిగ్రీ మధ్యలో ఆపేసి ఆటోలు, పెయింట్ పనులు, ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ సంపాదన సరిపోక ఈ దారిలో పయనించేవారూ ఉన్నారు. వీరు ఒంటరిగా వాకింగ్ చేస్తున్న మహిళలు, పిల్లలను స్కూలులో దించి వారి భోజన క్యారీలు తీసుకెళుతున్న సమయాల్లో ఎక్కువగా ఈ చోరీలకు పాల్పడుతున్నారు. రెక్కీ నిర్వహించిన ప్రదేశాల్లో మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంలో వెళుతూ మహిళల మెడల్లోని గొలుసు లాగేస్తారు. ఆ సమయంలో వారు కింద పడ్డా కనికరం లేకుండా ఈడ్చుకుంటూ వెళ్లిపోయి బంగారు గొలుసు చేజిక్కించుకుంటారు. తాళిబొట్టు సహా చేతికి చిక్కితే అది తెంచి క్షణాల్లో మాయమవుతున్నారు. పోలీసులు తక్కువ ఉన్న ప్రాంతాల్లో ఈ చైన్‌స్నాచర్లు ఎక్కువగా సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రజల మధ్యనే తిరుగుతూ

చాలామంది చైన్‌స్నాచర్లు సామాన్యుల్లాగే నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ మహిళల కదలికలు గమనిస్తుంటారు. సమయం చూసుకొని బంగారు దోచుకుని పరార్ అవుతున్నారు. మహిళలు ఎదురు తిరగలేరని తెలిసే ఈ తరహా దారుణాలకు ఒడిగడుతున్నారు. ఒకవేళ ఎవరైనా ప్రతిఘటిస్తే వారిపై కూడా దాడి చేసేందుకు వెనుకాడరు. గొలుసు తెంపే సమయంలో మహిళలు రోడ్డుపై పడి గాయాలపాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల పెండ్లిమర్రి పరిధిలో ఓ దొంగను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 15 తులాలు విలువ చేసే బంగారు చైన్లను, బైకును రికవరీ చేశారు.

జిల్లాలో ఇటీవల జరిగిన చైన్‌స్నాచింగ్ కేసులు..

● గతేడాది ఆగస్టులో చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలోని రామనపల్లెలో ఇంటి ముందు దుస్తులు ఉతుకుతున్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు.

● అలాగే గత అక్టోబరు నెలలో పులివెందుల మండలం రాయలాపురం గ్రామంలో మహిళ మెడలో చైన్‌స్నాచర్ గొలుసు లాక్కెళ్లాడు.

● ఈ ఏడాది ఏప్రిల్‌లో చింతకొమ్మదిన్నె పరిధిలో ఒంటరిగా వెళుతున్న మహిళను టార్గెట్ చేసుకొని ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. వారం తరువాత అదే పరిధిలో మరో మహిళ మెడలో 3 తులాలు విలువ చేసే బంగారు గొలుసును అపహరించారు.

● అదే నెలలో కమలాపురంలోని సి.రాజుపాలెంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని కత్తి చూపి బెదిరించి ఆమె మెడలోని బంగారు గొలుసు అపహరించారు.

● రెండు నెలల క్రితం కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో చైన్‌స్నాచర్లు ఒకే రోజు రెండు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

● జూన్‌లో కడప తాలుకా పోలీసుస్టేషను పరిధిలో ఒంటరిగా వెళుతున్న మహిళను టార్గెట్ చేసి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు.

● తొండూరు పోలీసుస్టేషన్ పరిధిలో గత నెల ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లిన ఓ యువకుడు మంచినీళ్లు అడిగి ఆమె తిరిగి వెళుతున్న సమయంలో ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లి పారిపోయాడు.

● ఈ ఏడాది జూన్ నెలలో పెండ్లిమర్రి మండలం కొత్తగంగిరెడ్డిపల్లెలో ఓ వృద్ధ మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించారు. జిల్లాలో తరచూ ఎక్కడో చోట ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. కొంత మంది యువత లక్షలు విలువ చేసే వాహనాల్లో తిరుగుతున్నారు. ఆ వాహనాలు ఎక్కడి నుంచి వచ్చాయనే నిఘా ఉంచాల్సిన అవసరం వారి తల్లిదండ్రులకు ఎంతైనా ఉంది.




ఇటీవల పెండ్లిమర్రి పోలీసులు దొంగను అరెస్టు చేసి అతని నుంచి రికవరీ చేసిన నగలు (ఫైల్)

లిక్కర్ స్కాంలో పెద్ద పావురం త్వరలో అరెస్టు

● తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్

కడప మారుతీనగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన లిక్కర్ స్కాంలో ఒక్కొక్కరుగా జైలు ఊచలు లెక్కిస్తున్నారని, అంతిమంగా తన మిత్రుడి కుమారుడు కూడా (పెద్ద పావురం-వైఎస్ జగన్‌రెడ్డి) అరెస్టు కానున్నారని కాంగ్రెస్ పార్టీ తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. జిల్లాల పర్యటనల్లో భాగంగా మంగళవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకూ టెక్నాలజీ కొత్తకొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో తప్పు చేసిన వారు తప్పించుకునే ఛాన్సే లేదని, కొద్ది రోజులు ఆలస్యమైనా పట్టుబడి శిక్షకు గురి కావాల్సిందే అన్నారు. రోజులన్నీ ఒకేలా ఉంటాయనుకోవడం చాలా పొరబాటనే సంగతి ఇటు పాలకులు, అటు ప్రతిపక్ష నాయకులు గుర్తెరిగి ప్రజలకు మంచి చేయకపోయినా చెడు పనులు చేయరాదన్నారు. అమరావతి నిర్మాణం కోసం దాదాపు 70వేల ఎకరాల భూములను రాజధాని కోసం ఇచ్చేందుకు ఆ ప్రాంత రైతులకు ఇష్టం లేదన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రం రాజధాని అమరావతి దేవతల రాజధాని అంటున్నారని, నాకైతే అక్కడ దేవతలెవరూ కనిపించకపోగా కర్ర తుమ్మచెట్లు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో సుమారు 20జిల్లాల ప్రజల్లో చాలా తక్కువగా అమరావతి రాజధాని పట్ల సుముఖత వ్యక్తం చేస్తున్నారని, ఉత్తరాంధ్ర ప్రజలు కూడా అమరావతి పట్ల సంతోషంగా లేరన్నారు. రాయలసీమ జిల్లాల్లో ఏ జిల్లాలో అయినా పరిపాలనా రాజధాని ఏర్పాటు చేసి, వైజాగ్‌లో హైకోర్టు ఏర్పాటు చేసినట్లయితే బాగుండేదని అన్నారు. రాయలసీమ సస్యశ్యామలం కావాలంటే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతా మోహన్

ప్రజలను దోపిడీ చేస్తున్న ప్రభుత్వాలు

● భూమి ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుంది

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

బద్వేలు, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల కనుసన్నల్లో ఉంటూ ప్రజలను దోచుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం సీపీఐ జిల్లా 25వ మహాసభలు బద్వేలు పట్టణంలో జరిగాయి. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డు నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందలేదని, కేవలం కార్పొరేట్ వ్యక్తులు మాత్రమే అభివృద్ధి చెందుతున్నారన్నారు. బీజేపీ అవలంబించే విధానాలను టీడీపీ, జనసేనలు భుజానికి ఎత్తుకుని మోస్తున్నాయని, దక్షిణ భారత దేశంలో మత గొడవలు సృష్టించేందుకు పవన్ కళ్యాణ్ నిరంతరం యత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలు గాలికొదిలి కాషాయం, సనాతనం, ధర్మం అంటూ ప్రజల మధ్య మతతత్వ గొడవలు పెట్టేందుకు సిద్ధమయ్యారే తప్ప ప్రజల సమస్యలు పరిష్కారం చేసింది లేదన్నారు. ఆదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగిస్తే ప్రజలు చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ ఎక్కడ అమలు చేశారో బహిరంగ చర్చకు రావాలన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లాగా గాలిలో మేడలు కడుతున్నారే తప్ప రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్నారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలు నేటికీ విచారణ చేపట్టలేదని, ఇందులో కూటమి నాయకుల భాగస్వామ్యం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు శివారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎస్.వెంకటసుబ్బయ్య, రామయ్య, వెంకటశివ, బాదుల్లా, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, సుబ్రమణ్యం, వేణుగోపాల్, చంద్రశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వి.రమణ, వెంకటరమణ, పెంచలయ్య, విజయమ్మ, నాగేష్, నరసింహ, రవికేశవ, నియోజకవర్గ కార్యదర్శులు పాల్గొన్నారు.

గండికోట రహస్యమేనా..?

● కాల్‌డేటాపై విచారణ

జమ్మలమడుగు, జూలై 22(ఆంధ్రజ్యోతి): గండికోటలో ఈ నెల 14న రంగనాథస్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగిన బాలిక హత్య కేసు రహస్యంగానే మిగిలింది. హత్య జరిగి దాదాపు తొమ్మిది రోజులు కావస్తున్నా నిందితులు ఎవరనేది తేలలేదు. జిల్లా అధికార యంత్రాంగం గండికోట బాలిక హత్యకేసుకు సంబంధించి ప్రత్యేకంగా పోలీసు అధికారులను, సిబ్బందిని నియమించి తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా బయటి ప్రాంతాల నుంచి గండికోటకు వచ్చిన వారి సెల్ నంబర్లను కనుగొని వారికి ఫోన్లు చేసి అర్బన్ పోలీసు స్టేషన్‌కు రప్పించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. అలాగే మైలవరం మండలం గుర్రప్పస్వామి ఆలయం వద్దకు సోమవారం అంతకు ముందు రోజు వచ్చిన భక్తులకు సంబంధించిన కాల్‌డేటాను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు జమ్మలమడుగు ప్రాంతంలో, పెద్దముడియం మండలం ఉలువపల్లి, గూడెంచెరువు, పొన్నతోట, అంబవరం, మోరగుడి తదితర ప్రాంతాలకు చెందిన కొందరి సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. హత్యకు గురైన బాలిక కుటుంబ సభ్యులను సైతం సోమవారం రాత్రి విచారణ చేసినట్లుగా తెలుస్తోంది. హత్య కేసు మిస్టరీ ఛేదించేందుకు జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో మొత్తం 95 మంది సిబ్బంది విచారణలో ఉన్నట్లు తెలిసింది.

మెడిసిన్ విద్యార్థిని ఆత్మహత్య

● పనిఒత్తిడే కారణమంటున్న బంధువులు

● అస్సాంలోని కాలేజ హాస్టల్‌లో ఘటన



హేమలత (ఫైల్)

ఎర్రగుంట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తికి చెందిన పీజీ గైనకాలజిస్ట్ విద్యార్థిని పడిగపాటి హేమలత (28) పని ఒత్తిడితో సోమవారం అస్సాంలోని కాలేజి హాస్టల్‌లో ఆత్మహత్యకు పాల్పడింది. పోట్లదుర్తికి చెందిన లక్ష్మిరెడ్డి, లక్ష్మిదేవిల పెద్ద కుమార్తె హేమలత. లక్ష్మిరెడ్డి పాలవ్యాపారం చేస్తున్నాడు. పెద్దకుమార్తె హేమలత అస్సాం రాష్ట్రంలోని బార్పేట జిల్లా ఫకృద్దీన్ ఆలీ అహ్మద్ మెడికల్ కాలేజీలో గైనకాలజీ రెండవ సంవత్సరం చదువుతోంది. కోర్స్‌లో భాగంగా ఆసుపత్రిలో వర్కింగ్ డ్యూటీలో ఎక్కువ సమయాన్ని కేటాయించడం వల్ల మానసిక ఒత్తిడికిలోనై ఇబ్బంది పడింది. ఈ నేపథ్యంలో వైద్యులకు కూడా చూపించుకుని రెండు నెలల క్రితం మళ్లీ కాలేజీకి వెళ్లింది. అయితే పనిఒత్తిడి ఏమాత్రం తగ్గకపోవడం వల్ల విసిగిపోయిన హేమలత కాలేజీ హాస్టల్‌లో సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆత్మహత్యకు గల కారణాలను కూడా ఆమె ఉత్తరం రాసినట్లు సమాచారం. కాలేజీ వారు దానిని దాచినట్లు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు అస్సాంకు బయలుదేరి వెళ్లారు.



హేమలత మృతదేహం

పోట్లదుర్తిలో విషాదం

ఏడాది వ్యవధిలో పోట్లదుర్తికి చెందిన ఇద్దరు పీజీ గైనకాలజీ విద్యార్థినులు మృతి చెందారు. కర్ణాటకలోని మంగళూరులో పీజీ గైనకాలజీ ఫైనలియర్ చదువుతున్న సృజన 2024 జూన్ 21న అనారోగ్యంతో మృతి చెందింది. అలాగే ప్రస్తుతం హేమలత సోమవారం అస్సాంలోని కాలేజీలో ఆత్మహత్యకు పాల్పడటం తల్లిదండ్రులను, బంధువులను, గ్రామస్థులను కలచివేస్తోంది.

ఇద్దరు మంచి బాల్య స్నేహితురాళ్లు

సృజన, హేమలత ఇద్దరూ మంచి బాల్యమిత్రులు. చదువులో ఎప్పుడూ ముందంజలో ఉండేవారు. పోట్లదుర్తి నలంద హైస్కూల్‌లో కలిసి చదువుకున్నారు. సృజన హైదరాబాదు గాంధీలో ఎంబీబీయస్ ఫ్రీ సీట్ సంపాదించి పూర్తి చేసింది. కర్ణాటకలోని మంగళూరులో పీజీ గైనకాలజిస్ట్ చేస్తూ మూడో సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందింది. అలాగే హేమలత కూడా వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ఫ్రీ మెడికల్ సీటు సంపాదించి పూర్తి చేసింది. అస్సాంలోని బార్పేట కాలేజీలో పీజీ గైనకాలజిస్ట్ సెకండియర్ చదువుతూ ఆత్మహత్యకు పాల్పడింది.

రోడ్డుపై రైతుల బైఠాయింపు

● జీలుగల కొరతతో ఆందోళన

గోపవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రైతులు జీలుగల కొరతతో తీవ్ర అసంతృప్తికి గురై రోడ్డుపై బైఠాయించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉన్న హైవేపై కూర్చొని ధర్నా చేశారు. కాల్వపల్లె, బెడుసుపల్లె, బుచ్చనపల్లె, సండ్రపల్లె, వడ్డె అగ్రహారం, రాచాయిపేట గ్రామాలకు చెందిన దాదాపు వంద మంది రైతులు ఆందోళనకు దిగారు. దీంతో భారీగా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ విషయమై రైతులు మాట్లాడుతూ గత నాలుగురోజులుగా అధికారులు ఈ రోజు, రేపు అంటూ జీలుగల కోసం తిప్పుతున్నారని, కానీ ఇప్పటికీ సరఫరా జరగలేదని పంట వేయాల్సిన సమయం దాటిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని జీలుగలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడగా, సిబ్బంది కొరత వల్లనే ఈ సమస్య తలెత్తిందని, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే మండల కార్యాలయంలో నెట్‌వర్క్ సమస్య తీవ్రస్థాయిలో ఉందని తెలిపారు. కాగా మధ్యాహ్నం నుంచి జీలుగల పంపిణీ ప్రారంభించినట్లు రైతులు తెలిపారు.



వాహనాలను నిలిపి రోడ్డుపై బైఠాయించిన రైతులు

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

● జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్



మోడల్ స్కూల్‌లో వంటగదిని తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్

కురబలకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం ముదివేడు సమీపంలోని మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అనంతరం వంటగదిని పరిశీలించి స్టాకు రిజిష్టర్‌ను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటుగా మంచి ఆహారం అందివ్వడం ఎంతో ముఖ్యమన్నారు. ఒకప్పుడు హాస్టల్స్‌లో కనీస వసతులు లేక ఎంతో ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి నిర్దిష్ట లక్ష్యంతో ముందుకెళ్లి జీవితాన్ని సవాల్‌గా తీసుకుని మంచి ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్ళి విజయాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధనంజయులు, ఆర్ఐ శేషాద్రిరావు, ఎంఈఓ ద్వారకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఒకరి అరెస్ట్



పోలీసుల అదుపులో సుబ్రహ్మణ్యం

నందలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నందలూరు పీఎస్ క్రైం నంబరు 191/2020 కేసులో ఏ-3 నిందితుడు రాజంపేట మండలం రేణింతల అరుంధతివాడకు చెందిన పాటూరు సుబ్రహ్మణ్యం అలియాష్ మణిని అరెస్ట్ చేసి తిరుపతి ఆర్ఎస్ఎస్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం కేసులో ముద్దాయిగా ఉండి కోర్టు వాయిదాలకు హాజరు కానందున కోర్టు అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇచ్చినందున అతన్ని తాను తమ సిబ్బంది పట్టుకుని తిరుపతి స్పెషల్ ఆర్ఎస్ఎస్ కోర్టులో హాజరుపరచగా సదరు కోర్టువారు రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్‌జైలుకు పంపించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సిద్దవటం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె గ్రామ సమీపాన రైల్వేటాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహం లభ్యమైంది. మంగళవారం రైల్వేస్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు కడప రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్ సూచన మేరకు పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సుభాన్ మాట్లాడుతూ నాలుగు రోజుల కిందట మృతిచెందినట్లుగా ఉందని, ఇతని ఆచూకీ కోసం విచారిస్తున్నామని తెలిపారు. రైల్లో ప్రయాణించేటప్పుడు ప్రమాదవశాత్తు కిందపడ్డాడా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని అన్నికోణాల్లో విచారిస్తున్నామన్నారు. మృత దేహాన్ని కడప రిమ్స్‌కు తరలిస్తున్నామన్నారు.

మదనపల్లె పంచాయతీ కార్యదర్శి బదిలీ

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ కార్యదర్శి ఎ.మాధవిని కర్నూలు జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. భార్యా భర్తల వర్గీకరణ కింద ఆమె చేసుకున్న దరఖాస్తున్న ప్రభుత్వం ఆమోదించి అంతర్ జిల్లా బదిలీకి సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు తగు చర్యలు తీసుకునేందుకు పంచాయతీ రాజ్ కమిషనరును అనుమతిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ఆడుదాం ఆంధ్ర ఖర్చుల వివరాలు ఇవ్వండి



సబ్‌కలెక్టరేట్‌కు లేఖ అందిస్తున్న విజిలెన్స్ సీఐ శివన్న, డీసీటీఓ

మదనపల్లెటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ఏడాదిన్నర కిందట నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఖర్చులు, వివరాలు ఇవ్వాలని కడప విజిలెన్స్ సీఐ శివన్న సబ్‌కలెక్టరేట్ డీఏఓ నిర్మలదేవిని కోరారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో డీఏఓను కలిసిన సీఐ, విజిలెన్స్ డీసీటీఓ గీతావాణి పలు అంశాలపై చర్చించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఎంత మంది క్రీడాకారులు పాల్గొన్నారు, ఎక్కడెక్కడ క్రీడలు నిర్వహించారు, ఒక్కో క్రీడాకారుడికి ఎంత ఖర్చు పెట్టారని వివరాలు అడిగారు. వీటిపై త్వరలో వివరాలు పంపానాలని కోరారు.

పీలేరులో భౌబోయ్...

- గుంపులుగా తిరుగుతున్న శునకాలు
- బడి పిల్లల తల్లిదండ్రుల ఆందోళన
- ద్విచక్ర వాహనదారుల్లోనూ భయం.. భయం



పీలేరు-మదనపల్లె మార్గంలో వాహనం వెంటపడుతున్న కుక్కలు

పీలేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో గ్రామసింహాలు యథేచ్ఛగా స్వైరవిహారం చేస్తున్నాయి. పట్టణంలోని ఒక ప్రాంతం అని కాకుండా ఎక్కడ చూసినా గుంపులుగా దర్శనమిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి వేళల్లో మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే భయపడిపోతున్నారని, వీధిలోకి రావాలంటే శకునం చూసే రోజులు పోయి శునకం చూసే రోజులు వచ్చాయని పలువురు స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వెంటపడుతున్న శునకాలను చూసి ద్విచక్ర వాహనదారులు కూడా భయపడుతున్నారు.

పెరిగిన కుక్కల సంతతి

పీలేరు పట్టణంలో చికెన్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల సంఖ్య పెరిగి పుష్కలంగా ఆహారం దొరుకుతుండడంతో వీధి కుక్కల సంతతి ఇటీవల విపరీతంగా పెరిగింది. దాదాపు గొర్రెల మందల్లా అవి పట్టణంలోని అన్ని ప్రధాన రోడ్లలో కనిపిస్తున్నాయి. మనుషులపైకి, వాహనాలపైకి అవి ఎగబడుతున్నాయి. దీంతో పాదచారులు, ఇటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని ఎల్‌బీఎస్ రోడ్డు, ఎస్వీ డీలక్స్ రోడ్డు, బీవీ రెడ్డి కాలనీ, ఆర్టీసీ పాత బస్టాండులు, నాగిరెడ్డి కాలనీ, ఆర్టీసీ నల్లగుట్ట, చెన్నారెడ్డి కాలనీ, అజంతా టాకీసు మిట్ట, యల్లమంద క్రాస్ ప్రాంతాల్లో కుక్కల విహారం ఎక్కువగా ఉంటోంది. వాటి సంచారం పెరిగిన కొద్దీ అవి మనుషుల మీద చేస్తున్న దాడులు పెరుగుతున్నాయి. తమ ఆసుపత్రికి ప్రతిరోజూ రెండు కుక్క కరిచిన కేసులు వస్తున్నాయని పీలేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి రాని కేసులు రోజుకు మరో నాలుగు ఉంటాయని పలువురు విశ్రాంత ఉద్యోగులు తెలిపారు.



పీలేరులోని ఎస్వీ డీలక్స్ రోడ్డులో కుక్కల గుంపు

ఇంటికి తిరిగి వచ్చే వరకు భయమే...

పీలేరు పట్టణం విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందుతుండడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని చాలామంది పిల్లలను పట్టణంలోని పలు పాఠశాలలు, ట్యూషన్ సెంటర్లలో తమ పిల్లల్ని చేరుస్తున్నారు. తరగతులను బట్టి ఆయా విద్యార్థులకు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల ఉదయం ప్రత్యేక తరగతులు ఉంటుంటాయి. కుక్కల కారణంగా ఆయా సమయాల్లో పిల్లల్ని ఒంటరిగా పంపాలంటే భయంగా ఉంటోందని పలువురు స్థానికులు పేర్కొన్నారు. గతంలో మాదిరి అవి మనుషులు, అదిరింపులకు భయపడడం లేదని, ఎంత అదిరించినా అవి పైపైకి వస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

శాశ్వత చర్యలు చేపట్టాలి

గతంలో కుక్కల సంతతిని నియంత్రించడానికి వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించేవారు. అందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆ పద్ధతికీ మంగళం పాడారు. ప్రస్తుతం పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ కుక్కలను పట్టుకున్నా వాటిని తీసుకెళ్లి భాకరాపేట అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నారు. అటు వైపు తిరుపతి ప్రాంతంలో పట్టిన కుక్కలను సైతం అక్కడే వదిలేస్తున్నారు. దీంతో అవి కొన్ని రోజులు అక్కడ ఉండి మళ్లీ తమ పాత ఊళ్లకు చేరుకుంటున్నాయి. దీంతో వాటి సమస్య తాత్కాలికంగా సమిసిపోయినట్లు కనిపించినా మళ్లీ విజృంభిస్తోంది. వాటి నియంత్రణకు ప్రభుత్వం ఏదైనా శాశ్వత చర్యలు చేపట్టాలని పీలేరు ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే కుక్కలు పట్టుకుంటాం

● లతీఫ్ ఖాన్, పీలేరు పంచాయతీ ఇన్‌చార్జ్ ఈవో

పీలేరులో కుక్కల సమస్య ఎక్కువైనట్లు ఇటీవల మాకు కూడా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని బంధించేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకున్న వారు కావాలి. అటువంటి వారి కోసం విచారిస్తున్నాం. త్వరలోనే వారిని పీలేరుకు పిలిపించి పట్టణంలోని కుక్కలను బందిస్తాం.

పుంగనూరు విలీనం వాయిదా ?

● మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల తరువాతే విలీనం ప్రక్రియ

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో పుంగనూరు నియోజకవర్గాన్ని విలీనం చేసే ప్రక్రియ వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వం నేరుగా ప్రకటన చేయకపోయినా మంగళవారం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు ఈ వాదనకు బలం చేకూరుతోంది. రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కాకుండా చిత్తూరు జిల్లా పరిధిలోకి అప్పటి వైసీపీ ప్రభుత్వం చేర్చింది. పార్లమెంటు పరిధిలోని మిగిలిన ఆరు నియోజకవర్గాలతో కలిపి అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాజంపేట పార్లమెంటు పరిధితో అన్నమయ్య జిల్లాను విస్తరించాలనే యోచనతో పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె డివిజన్‌లోకి మారుస్తూ మే 22న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మార్పులపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోగా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లకు రాతమూలకంగా పంపుకోవాలని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో సూచించింది. ఈ గడువు జూన్ 30వ తేదీతో ముగిసింది. అయినా ప్రభుత్వం విలీన ప్రక్రియను చేపట్టలేదు.

పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల మండలానికి చెందినవారు మాత్రం ఈ విలీనంతో విభేదించారు. ఆ మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. కొత్త ప్రతిపాదన ప్రకారం అన్నమయ్య జిల్లాలోనే కాకుండా ఇప్పుడున్న చిత్తూరు జిల్లా నుంచి కూడా పులిచెర్ల మండలాన్ని వేరు చేసి తిరుపతి జిల్లాలో చేర్చాలని అక్కడి నాయకులు పట్టుబట్టారు. ఈ డిమాండుపై తర్జనభర్జనలు పడుతున్న నేపథ్యంలో నోటిఫికేషన్ గడువు ముగిసి నెల రోజులైనా పుంగనూరు నియోజకవర్గంలోని మండలాలను అన్నమయ్యలో విలీనం చేసే ప్రక్రియ కొనసాగలేదు. ప్రభుత్వం ఈ అంశాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు సమాచారం. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పరిధులకు సంబంధించి సరిహద్దులపై ప్రజల డిమాండ్లను పరిశీలించి తగు సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం మంగళవారం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా, డివిజను, మండల కేంద్రాలకు ప్రస్తుతమున్న దూరాభారాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలని, సరిహద్దుల విషయంలో చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక అంశాలను సమీక్షించాలని, వీటన్నిటిలో సమతుల్యత పాటించే విధంగా అధ్యయనం చేసి తగు సూచనలు చేయాలని ప్రభుత్వం ఉపసంఘానికి సూచనలిచ్చింది. ఈ దశలో పుంగనూరు విలీనం అంశం, అందులో పులిచర్ల మండలాన్ని తిరుపతి జిల్లాకు మార్చే అంశాల విషయం మంత్రివర్గ ఉపసంఘం పరిధిలోకి వస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తం అన్ని జిల్లాల్లో వున్న వేర్వేరు డిమాండ్లతో పాటు పుంగనూరు విలీన ప్రక్రియను కూడా ఉపసంఘం పరిశీలనకు పంపి దాని సిఫారసుల ఆధారంగా తదుపరి ప్రక్రియను చేపట్టేందుకు నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే నెల రోజుల క్రితమే నోటిఫికేషన్ ప్రకారం గడువు ముగిసినా విలీన ప్రక్రియ ముందుకు సాగలేదని కూడా అంటున్నారు.

డిప్యుటేషన్ మరో ఏడాది పొడిగింపు

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా లైవ్ స్టాక్ అధికారి డెప్యుటేషన్ గడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లా లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ సంస్థలో ఈవోగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఎస్.పెంచలరాజు ఐదో సంవత్సరం కూడా గడువు పొడిగించింది. ఈ ఏడాది జూలై 16 నుంచి 2026 జూలై 15వ తేదీ వరకూ ఈ డెప్యుటేషన్ గడువు వర్తిస్తుందని పేర్కొంటూ పశుసంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఈ మేరకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

హెల్త్ సూపర్‌వైజర్‌పై విచారణ

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వేముల రమేష్‌పై విచారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2022 ఆగస్టు 20వ తేదీన లంచం తీసుకుంటుండగా ఏసీబీకి రమేష్ పట్టుబడ్డాడు. అప్పటి నుంచి ఈ కేసు విచారణకు నోచుకోకుండా మరుగున పడింది. 2024 ఆగస్టు 9న ఆ తరువాత ఈ ఏడాది మే 28 ఏసీబీ డైరెక్టర్ జనరల్ రమేష్ కేసుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి తగు చర్యల కోసం అందజేశారు. దరిమిలా దీనిపై విచారణ జరపాల్సి వున్న కారణంగా ప్రాథమికంగా నిందితుడు రమేష్ నుంచి వివరణ కోరుతూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి 10 రోజుల్లోగా తన వైపు వివరణలు సమర్పించాలని ఆదేశిస్తూ ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల హోస్‌మణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చోరీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఏఎస్పీ

● 9 తులాల బంగారం స్వాధీనం



వివరాలు తెలియజేస్తున్న ఏఎస్పీ మనోజ్‌హెగ్డే

ఓబులవారిపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చోరీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ మనోజ్‌హెగ్డే తెలిపారు. చోరీకి గురైన 9 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు మంగళవారం ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో నిందితులను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏఎస్పీ ఆ వివరాలు వెల్లడించారు. జూలై 14న చిన్నఓరంపాడు పంచాయతీలోని సీవో కమ్మపల్లె దళితవాడలో ఉంటున్న బొమ్ము ఈశ్వరమ్మ పక్కనే ఉన్న కిరాణా కొట్టుకు ఇంటికి తాళం వేయకుండా వెళ్లింది. అంతలోనే ఈశ్వరమ్మ బంధువులు అయిన రమాదేవి, రామసుబ్బమ్మ ఈశ్వరమ్మ ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను దొంగలించారు. సుమారు 9 తులాల నగలను దొంగలించి పక్కనే ఉన్న తమలపాకు తోటలో దాచిపెట్టారు. ఈనేపథ్యంలో 22వ తేదీ రాజంపేటలో అమ్ముకునేందుకు వెళుతుండగా పోలీసులు రెక్కీ నిర్వహించి పట్టుకున్నారు. రెండు బంగారు గాజులు, ఒక చైను, ఒక జత చెంప సరాలు, ఒక గుండ్ల బ్రాస్‌లెట్, ఒక చైను, ఒక ఉంగరం, ఒక జత మాటీలు, ఒక నెక్లీసు ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధుని కొండలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

● ప్రభుత్వ భూమిగా ప్రకటించిన రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు

మదనపల్లెఅర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిశెట్టిపల్లె గ్రామం సమీపంలోని బుద్ధుని కొండలో మంగళవారం పోలీసులతో కలిసి రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామ రెవెన్యూ సర్వేనెంబరు 15లో సుమారు 75 ఎకరాల ప్రభుత్వ గయాల భూమి ఉందని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలోకి ఎవ్వరూ ప్రవేశించరాదని, ఎలాంటి కట్టడాలు నిర్మాణాలు చేపట్టరాదని, అతి క్రమించి కట్టడాలు కట్టిన ఎడల చట్టప్రకారం శిక్షార్హులని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బుద్ధుని కొండపై కొద్దిరోజులుగా పోలీసుల పికిటింగ్ ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు కొండపై కూసాలతో పిన్సింగ్ వేశారు. కార్యక్రమంలో తాలుకా పోలీసుల తోపాటు వీఆర్వో నారాయణ పాల్గొన్నారు.

రామ భక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదం

● రూ.4.35 కోట్ల అన్న ప్రసాదానికి మంజూరు ● ఆగస్టు 1 నుంచి అమలు



భక్తులకు ఎంతో ఉపయోగం



ఒంటిమిట్ట కోదండరామాలయానికి వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలను పంపిణీ చేయడం ఎంతో ఉపయోగకరం. దూర ప్రాంత భక్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

- మేకపాటి నందకిశోర్‌రెడ్డి, ఒంటిమిట్ట

నిధుల కేటాయింపు సంతోషకరం



రామ భక్తులకు నిరంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేసేందుకు నిధులు కేటాయించడం సంతోషకరం. రాత్రి వేళల్లో భోజనం లభించక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిరంతరాయ అన్న ప్రసాద పంపిణీతో భక్తుల అవస్థలు తీరుతాయి.

- పసుపులేటి సుబ్బరాయుడు, ఒంటిమిట్ట

ఒంటిమిట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముని భక్తులకు టీటీడీ తీపి కబురు అందజేసింది. భక్తులకు ఆకలి తీర్చడానికి మూడు పూటలా అన్న ప్రసాదాలను పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం టీటీడీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఒంటిమిట్ట రామ భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలను పంపిణీ చేసేందుకు రూ.4.35 కోట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కేటాయించినట్లు తెలిపారు. దీంతో రామ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2016లో ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం టీటీడీలో విలీనం చేసింది. ఆలయ అభివృద్ధి కోసం సుమారు వంద కోట్లను టీటీడీ కేటాయించింది. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తుంది. మూడు సంవత్సరాల క్రితం రామ భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేయాలని నిర్ణయించి ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. ప్రతిరోజు సుమారు 500 మంది భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. టీటీడీ వారు కేవలం మధ్యాహ్నం మాత్రమే అన్న ప్రసాదం పంపిణీ చేస్తుండడంతో రాత్రి సమయంలో భక్తులకు సరైన భోజనం లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్నారు. వీరికి రాత్రి వేళల్లో సరైన భోజన సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ యేడాది ఏప్రిల్ నెలలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేసి కల్యాణం అనంతరం టీటీడీ అధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామభక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను పంపిణీ చేయాలని టీటీడీ అధికారులను ఆదేశించారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి మూడు పూటల భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. అందుకు అనుగుణంగా మంగళవారం జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో నిధుల కేటాయింపు కూడా జరిగింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, అల్పాహారం అందేలా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీ పాలకవర్గం నిరంతరాయ అన్న ప్రసాద పంపిణీకి నిధులు కేటాయించడంతో రామ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఒంటిమిట్టలోని అన్న ప్రసాద కేంద్రం

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

ఒంటిమిట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటిమిట్ట, మంటపంపల్లె, కొత్తమాధవరం ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలను తనిఖీ నిర్వహించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. డొక్కా సీతమ్మమధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీ వారు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఒంటిమిట్ట ప్రధానోపాధ్యాయులు రవీంద్రకుమార్, మంటపంపల్లె ప్రధానోపాధ్యాయులు ఐజయ్య, కొత్తమాధవరం ప్రధానోపాధ్యాయులు అంబేద్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్

ఎన్నేళ్లో.. ఎదురు చూపులు

- 14 ఏళ్లు అయినా... ఉద్యోగాలు ఇవ్వరా
- అదిగో ఇదిగో అంటూ సాగదీస్తున్న యూసీఐఎల్
- ఆర్డీఓ కార్యాలయంలో ఫైల్ మాయం
- లబోదిబోమంటున్న బాధితులు

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపల్లె వద్దనున్న యూసీఐఎల్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తామని చెప్పి 14 ఏళ్లు అవుతున్న నేటికి అతీగతీ లేదు. యూసీఐఎల్ టెయిలింగ్‌పాండ్ నిర్మాణంలో భూములు కోల్పోయిన మూడు కుటుంబాల వారు ఉద్యోగాల కోసం వేముల తహసీల్దార్ కార్యాలయం, పులివెందుల ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. తాజాగా వీరికి సంబంధించిన ఫైల్ ఆర్డీఓ కార్యాలయంలో మాయం అయ్యిందని బాధితులు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే..

వేముల మండలంలోని ఎమ్.తుమ్మలమలపల్లె వద్ద యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్) ఆదర్యంలో 14ఏళ్ల క్రితం యురేనియం శుద్ధికర్మాగారం ఏర్పాటు చేశారు. కర్మాగారం ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి, ఆ కుటుంబబాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని యూసీఐఎల్ ప్రకటించింది. అలాగే శుద్ధి కార్మగారంలో ముడి యురేనియం శుద్ధి అనంతరం వచ్చే వ్యర్థాలు టెయలింగ్‌పాండ్‌లో నిల్వచేయాల్సి ఉంది. ఇందుకోసం సేకరించిన భూములకు సంబంధించి ఇప్పటికీ కొంతమందికి యూసీఐఎల్ న్యాయం చేయాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేకే కొట్టాలకు సంబంధించిన భాస్కర్, రవిశంకర్, రాజశేఖర్ గుప్త కుటుంబాలకు సంబంధించిన వ్యవసాయ భూములు టెయిలింగ్ పాండ్ నిర్మాణంలో కోల్పోయారు. 884 సర్వే నెంబర్‌లో వీరి ముగ్గురికి సంబంధించిన వ్యవసాయ భూములు యూసీఐఎల్ తీసుకుంది. కానీ ఈ సర్వే నెంబర్‌లో ఉన్న విస్తీర్ణంలో రెండుసెంట్ల భూవిస్తీర్ణం భూరికార్డుల్లో అధికంగా ఉందని.. ఇది సరిచేసుకుంటే ఉద్యోగం కల్పిస్తామని యూసీఐఎల్ అప్పట్లో చెప్పింది. ఈ కారణంతో 14 ఏళ్లుగా మాకు ఉద్యోగాలు కల్పించకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారని ఈ ముగ్గురు బాధితులు వాపోతున్నారు. వందలసార్లు వేముల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆ ఫైల్‌ను ఆర్డీఓ కార్యాలయానికి ఆరు నెలల క్రితం చేర్చామని... అప్పటి నుంచి అనేక మార్లు ఆర్డీఓ కార్యాలయానికి తిరుగుతున్నా అదోగో ఇదిదో అని సాకులు చెప్పడం తప్ప మాకు న్యాయం జరగడం లేదని వారు ఆవేదన చెందారు. గత నెల రోజులుగా ఆర్డీఓ కార్యాలయలో ఈ ఫైల్ కనిపించడం లేదని అధికారులు సెలవిస్తున్నారు. దీంతో భాస్కర్, రవిశంకర్‌లు మా ఫైల్ ఎక్కడకు పోయిందని ప్రతిరోజు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతికి సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లగా... ఆ సమయంలో బాధితులు ఇరువురు వారి ఫైల్ విషయమై ఏఓ రవీంద్రారెడ్డిని ప్రశ్నించా టరు. మా ఫైల్ మీ టేబుల్‌పైనే ఉందని గతంలో ఏఓగా పని చేసిన, ప్రస్తుతం వేముల తహసీల్దార్‌గా ఉన్న రెడ్డిలక్ష్మి చెప్పారన్నారు. ఇందుకు ఏఓ నా టేబుల్‌పైన ఎలాంటి ఫైలు లేదని వారికి తెగేసి చెప్పారు. చివరకు వేముల తహసీల్దార్ రెడ్డిలక్ష్మికి ఫోన్ చేసి ఫైల్ ఎక్కడుందని ప్రశ్నించడంతో మీ టేబుల్‌పైనే ఉందని ఆమె సమాచారం ఇచ్చారు. కానీ ఆ ఫైల్ మాత్రం కనిపించలేదు. ఈ ఫైల్ విషయమై రెండు రోజుల క్రితం ఆర్డీఓ చిన్నయ్యను అడగ్గా.. అందుకు ఆయన ఉందిలే అంటున్నారు తప్ప ఎక్కడున్నది కూడా తెలపడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ విషయమై ఆర్డీవోను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఫైల్ నా వద్దనే ఉందని.. ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు.


పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో ఫైల్ కోసం ఏఓను అడుగుతున్న బాధితులు

ఉద్యోగం ఎప్పుడు ఇస్తారో...



మా కుటుంబానికి సంబంధించి 884/పి4 సర్వేనెంబర్‌లో 84సెంట్ల భూమి ఉండేది. ఈ భూమిని టెయిలింగ్ పాండ్ నిర్మాణంలో యూసీఐఎల్ వారు తీసుకున్నారు. మాకు ఉద్యోగం ఇస్తామని చెప్పి 14ఏళ్లుగా తిప్పుకుంటున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయాం. ఎప్పటికి యూసీఐఎల్‌లో ఉద్యోగం ఇస్తారో తెలియడం లేదు.

-రవిశంకర్, కెకె కొట్టాల, వేముల మండలం.

రిటైర్‌మెంట్ స్టేజీలో ఇస్తారా..



యురేనియం ప్రాజెక్టు నిర్మించే సమయంలో టెయిలింగ్ పాం డ్ కోసం 884/పీ3లో మా భూమి యూసీఐఎల్ తీసుకుంది. ఉద్యోగం ఇస్తామని చెప్పి 14 ఏళ్లుగా మమ్మల్ని తిప్పుకుంటు న్నారు. సగం జీవితం అయిపోయింది. రిటైర్‌మెంట్ స్టేజీలో మాకు ఉద్యోగాలు ఇస్తారా....

-భాస్కర్, కెకెకొట్టాల, వేముల మండలం

బాలల పరిరక్షణలో భాగస్వాముల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): బాలల పరిరక్షణలో సంబంధిత కమిటీ సభ్యుల భాగస్వామ్యం కీలకమని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో బాలల పరిరక్షణలో భాగస్వాముల పాత్ర అనే అంశంపై జమ్మలమడుగు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల పరిధి లోని తహశీల్దార్లు, ఎంపీడీవోలు, బాల సంక్షేమ పోలీసు అధికారులు, మండల విద్యాధికారులకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాలల పరిరక్షణలో ప్రతి విభాగం సమన్వయం అవసరమన్నారు. పిల్లలకు సంబంధించిన కేసుల్లో వీరందరి పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులకు ఐసీడీఎస్‌పీడి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సమాజ సంక్షేమ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఆ రెండు రైళ్లకు స్టాపింగ్ ఇవ్వండి

- రైల్వే అధికారులకు బీజేపీ నాయకుల వినతి


రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జమ్మలమడుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రైల్వే స్టేషన్‌లో రైలు తిరుపతి-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17262), గుంటూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు (17261) నిలపాలని బీజేపీ నాయకులు రైల్వే అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం రైల్వేస్టేషన్ వద్దకు వచ్చిన గుంతకల్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్, సీనియర్ డివిజన్ ఆపరేటింగ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్‌లకు జమ్మలమడుగుకు చెందిన బీజేపీ నాయకులు సిలివేరి వెంకటేశ్వర్లు, గండికోట చారిటబుల్ ట్రస్టు నేత వై.చంద్రశేఖర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రైల్వే అధికారులతో వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తిరుపతి గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు జమ్మలమడుగులో నిలిపేవారని.. దీంతో విద్యార్థులకు, ఉద్యోగులకు, దాల్మియా ఫ్యాక్టరీ కార్మికులకు, గండికోటకు వచ్చే పర్యాటకులకు ఎంతో సౌకర్యంగా ఉండేదన్నారు. 2025 జూలై 7 నుంచి జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో ఆ రైళ్లు నిలుపుదల ఆపేశారన్నారు. దీంతో ప్రయాణికులు విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు ఊసువాండ్ల పాములేటి, రమణారావు, రంగనాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ సీసీఐ డ్రాయింగ్ పోటీకి చీఫ్ జడ్జిగా గంపమల్లయ్య ఎంపిక

కడప ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హ్యూమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ విశాఖపట్టణం గీతం యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్ సీసీఐ డ్రాయింగ్ పోటీలో, జాతీయస్థాయి ప్రతిభావంతుడు, పలు అవార్డులు అందుకున్న బీరీ గంపమల్లయ్య చీఫ్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈయన కడప నగరం హైద రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది సీనియర్ కళాకారులు ఉన్న కూడా ఈ అవకాశాన్ని తనకు ఇవ్వడం పట్ల ఎంతో కృతజ్ఞతగా భావిస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఎంఈఓలకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్

కడప ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీ బదిలీల మాన్యువల్ కౌన్సెలింగ్‌లో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో బదిలీల చట్టం 2025 ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై కడప ఎంఈవో గంగిరెడ్డి, ప్రొద్దుటూరు ఎంఈఓ సావిత్రమ్మలకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు షంషుద్దీన్ తెలిపారు. పది రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రిఫరెన్షియల్ క్యాటగిరీలో కేటాయించాల్సిన స్థానాల కంటే అధికంగా కేటాయించారని... దీంతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టంగా పోయారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవడం జరిగిందని స్పష్టం చేశారు. అలాగే విధుల పట్ల అలసత్వంగా వ్యవహరించినందుకు ఎస్‌జీటీ ఎంపీ శివారెడ్డికి కూడా ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీ చేశామన్నారు. ఈయన కూడా పది రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు.

భార్యను చంపిన భర్త అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న సీఐ శివశంకర్

చాపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండంలోని చియ్యపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల గోపాల్ తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని హత్య చేశాడు. మంగళవారం అతన్ని అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరుపరిచినట్లు రూరల్ సీఐ శివశంకర్ పేర్కొన్నారు. చాపాడు పోలీసు స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ గురువారం రాత్రి నల్లబోతుల గోపాల్ తన భార్య సుజాతను టవల్‌తో గొంతు నులిమి చంపాడు. ఈమేరకు అతనిపై కేసు నమోదు చేసి.. ప్రొద్దుటూరు-మైదుకూరు జాతీయ రహదారి పక్కన చియ్యపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఉండగా అరెస్టు చేశామని తెలిపారు.

బాలిక హత్య కేసులో పదేళ్లు జైలుశిక్ష

కడప క్రైం/రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) మూడేళ్ల బాలికను హత్యచేసిన కేసులో పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ మంగళవారం నాల్గవ అదనపు జిల్లా కోర్టు తీర్పును వెలువరించింది. చిన్నచౌకు పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు పట్టణం బుధవారపేటకు చెందిన కత్తెర విశ్వనాధం (35) తన భార్యతో కలిసి కడప నగరానికి కూలి పనులకు వచ్చి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఒక అద్దె ఇంట్లో నివశించేవాడు. దూరపు చుట్టమైన సుజాత తన కుమార్తె మూడేళ్ల శ్రీలతను విశ్వనాధం ఇంట్లో వదిలి కూలి పనులకు వెళ్లింది. దీంతో చిన్నారి తనకు నిద్రాభంగం కలగజేసిందని 2017 ఫిబ్రవరి 1న విక్షణా రహితంగా కొట్టి చంపాడు. ఈ మేరకు చిన్నచౌకు పోలీసులు ఐపీసీ సెక్షన్ 304 కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. మంగళవారం జరిగిన తుది తీర్పులో అతన్ని దోషిగా నిర్ధారించి 10 సంవత్సరాలు సాదారణ జైలు శిక్షతో పాటు రూ.1000లు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



కడప క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫారం వద్ద మంగళవారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తికి 60 సంవత్సరాల వయసు ఉంటుంది. ఇతను సహజ మరణం చెందినట్లు తెలిపారు. మృతుడి ఛాతి మధ్యలో మానిపోయిన తెల్లటి గాయం మచ్చ ఉందని.. ఇతర వివరాలకు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి రహదారిలోని గోటూరు సమీపంలో కపిల్ చిట్‌ఫండ్స్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... కుమారునిపల్లెకు చెందిన నందకిశోర్ సొంత పనిపై ద్విచక్రవాహనంలో కడపకు వెళుతుతుండగా.. కడప నుంచి కమలాపురం వైపు బైకులో వస్తున్న బత్తల బాబు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు మట్కా బీటర్లు అరెస్టు

కడప క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కపల్లె సర్కిల్ సమీపంలో ఇద్దరు మట్కా బీటర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాల మేరకు... మంగళవారం మట్కా ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ అమర్‌నాధరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసి కటారు శ్రీనివాసులు, ఆంజనేయ ప్రసాద్‌రెడ్డిలను అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రూ.4200 నగదు, మొబైల్ ఫోను, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో 8 మంది అదుపులో...

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలపై హత్యాయత్నానికి పాల్పడిన బాబురెడ్డి మరో 11మందిపై కేసు నమోదైంది. ఈ కేసులో బాబురెడ్డితో పాటు మరో 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న అనంతరం పోలీసులు కోర్టుకు హాజరు పరిచే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

దువ్వూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఏకోపల్లె గ్రామానికి చెందిన చెంచయ్యగారి ప్రసాద్ అనే వ్యక్తి కొంత కాలంగా ఓ బాలికను లైంగికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెళ్లి చేసుకోకుండా మోసం చేసిన వ్యక్తిపై...

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం చేసుకొని పెళ్లికి నిరాకరిస్తున్న యువకుడిపై పులివెందుల పోలీస్ స్టేషన్‌లో చీటింగ్‌కేసు నమోదైంది. తాడిపత్రికి చెందిన జయచంద్ర ఇటీవల పులివెందుల మండలంలో ఓ యువతితో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. జయచంద్ర చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఎంగేజ్‌మెంట్ అయిన తర్వాత పెళ్లికి నిరాకరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు.

పశుపోషణతో సుస్థిర ఆదాయం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ రమణ

ప్రొద్దుటూరు టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పశుపోషణ ద్వారా రైతులు సుస్థిర ఆదాయం సాదించవచ్చని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జేవీ రమణ తెలిపారు. మంగళవారం శ్రీవెంకటేశ్వర పశువైద్యశాలలో హైదరాబాదుకు చెందిన ఐసీఏఆర్ అనుబంధ సంస్థ ఎన్ఏఆర్ఎం సహకారంతో సుస్థిర గ్రామీణ జీవనోపాధిలో పాడిపరిశ్రమ ఆవశ్యకత అనే అంశంపై అయిదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషణ ద్వారా రైతులు, యువత ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ వెంకటేశ్వరరావు సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ పశుపెంపకం, దేశవాలీ ఆవుల ప్రాముఖ్యత, జీవ ఎరువులు, రసాయనాలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి మాట్లాడుతూ పశువులు, పశువుల ఉత్పత్తి ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని సూచించారు. ఎన్ఏఆర్ఎం శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ, పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ గీతాప్రియ, యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ కన్వీనర్ డాక్టర్ మాలకొండయ్య, పశువైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో విజయవాడ, అనంతపురం, కదిరి, బద్వేలు, మైలవరం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన 45 మంది యువ రైతులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్టు

కడపక్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం గంజికుంట కాలనీలో గత నెల 25న గొంతుముక్కల వెంకటసుబ్బయ్యపై కత్తితో దాడి చేసిన కేసుకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. కడప చిన్న చౌకు పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు. కడప మాసా పేటకు చెందిన తాటిగిరి అనూష, పాలెం సుబ్బరా యుడు అలియాస్ సుబ్బన్న, సీకేదిన్నె మండలం నరసరా మయ్యగారిప ల్లెకు చెందిన సోమ ప్రశాంత్, సుగమాల నవీన్ అలియాస్ శిగనమాల నవీన్, సిబ్యాల సుబ్బరాయుడు, మాసా పేటకు చెందిన తాటిగిరి నిర్మలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తి, బైకు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో మహిళ...

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో కరుణ కుమారి అనే మహిళను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ చాంద్ బాష తెలిపారు. పట్టణంలోని గుంతబజార్‌లో నివాసం ఉంటు న్న ఒంటరి మహిళ అయిన హసీనా జూలై 1వ తేదీ హత్యకు గురయ్యారు. ఈ కేసులో నిందితురాలుగా ఉన్న కరుణకుమారి అనే మహిళను సోమవారం అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు.

1229 మంది నిరుపేద పిల్లల గుర్తింపు

- అందరికీ ఆధార్ రిజిస్ట్రేషన్ : జడ్జి

కడప రూరల్, జూలై 22: నిరుపేద పిల్లల ఆధార్ కోసం సర్వే నిర్వహించి 1229 మందిని గుర్తించామని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సాతి కమిటీ మెంబర్స్‌తో జిల్లా వ్యాప్తంగా నిరుపేద పిల్లల ఆధార్‌కోసం సర్వే నిర్వహించి ఆధార్ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతోందని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి తగు చూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీ నాయుడు, రాయచోటి రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ప్యానల్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు

26న బండలాగుడు పోటీలు

సీకేదిన్నె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26 శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా అప్పరాజుపల్లె అభయహస్త ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కేటగిరి ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.40,116, రెండో బహుమతి రూ.30,116, మూడో బహుమతి రూ.20,116, నాలుగో బహుమతి రూ.15,116, ఐదో బహుమతి రూ.10,116, 6వ బహుమతి రూ.6,116, 7వ బహుమతి రూ.5,116 అందించనున్నట్లు తెలిపారు. ఎద్దుల యజమానులు శనివారం ఉదయం 11 గంటలలోపు పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి


రాహుల్‌రామిరెడ్డి (ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి-జూబ్లీనగర్ గ్రామాల మధ్య రోడ్డుపై కారు అదుపుప్పి బోల్తాపడిన ఘటనలో కడపకు చెందిన వైద్య విద్యార్థి ఏటూరి రాహుల్ రామిరెడ్డి (24) దుర్మరణం చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురు వైద్యవిద్యార్థులకు గాయాలయ్యాయి. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.... కడపకు చెందిన ఏటూరి రాహుల్‌రామిరెడ్డి, గుంటూరులోని శ్యామలనగర్‌కు చెందిన మోపిదేవి జయంత్, కర్ణాటకలోని రాయ్‌చూర్ జిల్లా చిందంటౌన్‌కు చెందిన కడియ వినయ్ చౌదరి, హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎం.పృథ్వీరాజ్, సిద్దిపేటలోని మోయిన్‌పురాకు చెందిన బి.పృథ్వీరాజ్ కరీంనగర్‌లోని ప్రతిమ వైద్య కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉంటున్నారు. సోమవారం సెలవు కావడంతో ఐదుగురు కరీంనగర్‌లోని బొమ్మకల్ శివారులో ఉన్న చల్మెడ వైద్య కళాశాలలో స్నేహితులను కలిసేందుకు ఉదయం 10 గంటలకు కారులో వెళ్లారు. తిరిగి అదేకారులో రాత్రి 1:30 గంటలకు ప్రతిమ కళాశాలలోని హాస్టల్‌కు బయ ల్దేరారు. జూబ్లీనగర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొని బోల్తాపడింది. దీంతో కారులో వెనకవైపున కూర్చు న్న రాహుల్ రామిరెడ్డి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న జయంత్‌తో పాటు మిగతావారికి స్వల్పగాయాల య్యాయి. గాయపడ్డవారు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. రాహుల్‌రామిరెడ్డి సోదరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వెనుకంజలో చిత్తూరు, కడప జట్లు

కడప స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ పోటీలలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లలో మంగళవారం చిత్తూరు, కడప జట్లు వెనుకంజలో సాగుతున్నాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 66.3 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో చిత్తూరు బౌలర్ రాకేష్‌సాయి 6 వికెట్లు పడగొట్టారు. అనంతరం చిత్తూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. ఇందులో ఎంఎస్ అక్తర్ 47 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో చిత్తూరు జట్టు మరో 146 పరుగుల వెనుకబడి వుంది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు- కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు 69.2 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో కడప బౌలర్ గైబు 6 వికెట్లు సాధించడం విశేషం. అనంతరం కడప జట్టు రెండో ఇన్నింగ్స్‌లో రెండవరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 95 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. ఇందులో జయప్రణవశాస్త్రి 13 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. మరో 59 పరుగుల వెనుకంజలో కడప జట్టు ఎదురీదుతోంది.

గ్రామీణాభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం..

● ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి

చెన్నూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లెలో మంగళవారం సాయంత్రం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన మాటాడారు. ఆగస్టు 3న దివ్యాంగుల కోసం ఏర్పాటు చేస్తున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో దివ్యాంగులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఉప్పరపల్లె పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. ఉనికిని కాపాడుకోవడం కోసం వైసీపీ నాయకులు మళ్లీ గ్రామాల్లోకి వస్తున్నారని, వారి మాటలను నమ్మితే ఏం జరుగుతుందో గత ఐదేళ్ల కాలంలో తెలిసిందేనన్నారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు


ఉప్పరపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

వెంకటసుబ్బారెడ్డి, మండల కన్వీనరు విజయ భాస్కర్‌రెడ్డి, జి.రామచంద్రా రెడ్డి, ఆవుల శంకర్‌రెడ్డి, ఆవుల శివనాగమల్లారెడ్డి, బత్తిన వీరభద్రారెడ్డి, నరసారెడ్డిపల్లె చంద్ర, దామోదర్‌రెడ్డి, గుణ, మండల స్థాయి అధికారులు తహసీల్దారు సరస్వతి, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

సీకే దిన్నె : రూ.30 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. కడప కార్పొరేషన్ 49వ డివిజన్‌లోని రాయలపంతులపల్లి (పూలోనిపల్లి) రోడ్డు పనులను మంగళవారం కడప కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర, స్థానిక కార్పొరేటర్ ఉమాదేవి కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగా రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలిచి కూటమి గెలుపులో భాగస్వాములు అయ్యారని వారి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ముందుంటుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అన్నం నరసయ్య, స్థానిక నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్ ఈఈగా విజయ్‌కుమార్‌రెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థ ఈఈగా విజయ్ కుమార్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న ఈఈ నారాయణస్వామి బదిలీ అయ్యారు. విజయ్‌కుమార్‌రెడ్డి గతంలో కడప మున్సిపాలిటీలో వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం ఈఈగా బాధ్యతలు చేపట్టనున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

● బీటెక్ రవి

సింహాద్రిపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) తెలిపారు. మంగళవారం సింహాద్రిపురంలోని తన ఇంట్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి , సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేశారు.కార్యక్రమంలో మారెడ్డి జయభరత్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పులివెందుల: మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్ చిన్నకొండారెడ్డి కాలనీలో సుపరిపాలన తొలిఅడుగు .. ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందరర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆ కుటుంబంలో ఏపసంక్షేమ పథకాలు వారికి అందాయో అడిగి తెలుసుకున్నారు. ప్రజల


విద్యార్థులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తూగుట్ల మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Kadapa Branch issues the following notice to the general public. My client intend to grant loan to **Smt. Mude Rajamma Wife of Mude Ramu Naik,** residing at D.No. 37/48, Chinna Bidiki, Rayavaram Village, Sundupalle Mandal, YSR Kadapa dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 7days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the ragard. **SCHEDULE OF THE PROPERTY** : An extent of Ac. 0.10 cents or 484 square yards out of Ac. 0.33 cents in survey no. 555/2 of Chinna Chowk Village fields, within kadapa municipal corporation, kadapa urban sub District, Kadapa District. **BOUNDARIES** : EAST : Remaining site of K. Marthamma, WEST: Road, NORTH: Site of Pullaiahari Narayana Reddy, SOUTH: Site of Ayyammagari Subbanna

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd Kadapa Branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Shaik Abdul Saleem S/o Shaik Ibrahim Sab** R/o D.No: 19/238A, Kadapa Town, Kadapa Dist by mortgaging the below schedule mentioned property as security by way of Registered mortgaged. And As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 7 days from the date of this notice, otherwise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTY**: Item No.1, **Sy. No.** : Survey No. 408/1, **Extent Area (in acres / hec. Sq.Yds./ Sq.ft.)** Ac.0.05 Cents **Location (Address) :** Vacant site situated in Kadapa District, Kadapa Sub-District, Kadapa Town, Chinnachowk Panchayat, Chinnachowk Village fields, Chalmareddypalem in Sy.No. 408/1 to an extent of 0.05 Cents, Plot No. 51 **Boundaries** ; East : Plot No. 52 Site, West : Plot No. 50 Site, North : Plot No. 28 Site, South : 25 Links Width Road

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

27 నుంచి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి జిల్లాపర్యటన

కడప మారుతీనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దయాకర్‌రెడ్డి, కార్యదర్శులు నాగోతు రమేష్‌నాయుడు, బాలకృష్ణయాదవ్, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, నాయకుడుపనతల సురేష్ మాట్లాడారు. ఈనెల 27న దేవుని కడప ఆలయంలో పూజల అనంతరం జిల్లాలో పర్యటిస్తారన్నారు. 28న నంద్యాల, 29న కర్నూలు, 30న అనంతపురం, 31వ తేదీ సత్యసాయిజిల్లాతో మొదటి విడత పర్యటన ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు యల్లారెడ్డి, కడప పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

'కేంద్రం ఇవ్వాల్సింది కొండంత.. ఇచ్చింది గోరంత!'

వేంపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టం ప్రకారం నవ్యాంధ్రకు కేంద్రం ఇవ్వాల్సింది కొండంత ఉండగా ఇచ్చింది గోరంత మాత్రమే అని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వెలిబుచ్చారు. ప్రత్యేక హోదా, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీకి తిలోదకాలిచ్చిందన్నారు. రాజధానికి నిధులు ఇవ్వడం లేదు, కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం నిర్మించలేదన్నారు. ఓడరేవులు, మెట్రో రైళ్ల ప్రస్తావనే లేదన్నారు. మోడీ మోసకారితనం, ప్రాంతీయపార్టీల చేతగానితనం ఇందుకు కారణాలన్నారు.

సమ్మె తాత్కాలిక వాయిదా

కడప ఎర్రముక్కపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది చేస్తున్న సమ్మె తాత్కాలికంగా వాయిదా పడిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షుడు సుంకర రవి తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చుకునేందుకు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

పోలేరమ్మ గుడిలో శూలం ఏర్పాటుపై వివాదం

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జండా మాను వీధి సమీపంలో ఉన్న పోలేరమ్మ గుడి వద్ద శూలం ఏర్పాటు విషయమై రెండు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకోగా పోలీసులు రంగ ప్రవేశంచేసి సర్దిచెప్పారు. అనంతరం డీఎస్పీ మురళినాయక్ వద్ద రెండు మతాలకు చెందిన పెద్దలు చర్చించారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలోని త్రిశూలాన్ని ఎవరో తీసుకెళ్లారని, ప్రస్తుతం దానిని మళ్లీ ఏర్పాటు చేసుకుంటుంటే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మరో వర్గానికి చెందిన పెద్దలు మాట్లాడుతూ. త్రిశూలం ఏర్పాటు చేసుకుంటే అభ్యంతరం లేదని, గుడి ఎదురుగా గదులు నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనితో డీఎస్పీ మురళినాయక్ కలుగజేసుకొని బుధవారం ఆర్డీఓ సమక్షంలో సర్వే చేయించి సమస్య పరిష్కరిస్తా మన్నారు.

ఇరువర్గాల నుంచి పది మంది చొప్పున మాత్రమే ఈ కార్యక్రమానికి రావాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు శశిభూషణ్‌రెడ్డి, రాష్ట్ర సాంకేతిక విభాగం కన్వీనర్ భానుప్రకాష్, జై హిందూస్థాన్ పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ ఖాదర్‌బాషా, ఖలందర్, అర్బన్ సీఐ చాంద్‌బాషా, ట్రాఫిక్ సీఐ హాజీవలి, ఎస్ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

GOVERNMENT OF INDIA, MINISTRY OF FINANCE,
DEPARTMENT OF FINANCIAL SERVICES
COURT OF THE RECOVERY OFFICER
DEBTS RECOVERY TRIBUNAL-2- AT HYDERABAD
1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001. Ph:040-24756467

FORM - I.T.C.P 29
(See rule 85 of the Second Schedule to Income-tax Act, 1961)
NOTICE TO LEGAL REPRESENTATIVE
R.P. 524 of 2019
IN
O.A. No.133 of 2019

Between:
Canara Bank (E-Syndicate Bank), Mochampet Branch, Kadapa District, Andhra Pradesh. .....**Certificate Creditor**
And:
1. **Smt. Nagam Gopalamma, W/o Sri. Nagam Yella Reddy,** R/o 1/210-1, Sri Lakshmi Nagar, Chinna Chowk, Kadapa District, Andhra Pradesh-516002. ....**Certificate Debtors No.1**
2. **Sri Nagam Yella Reddy, S/o N. Subba Reddy,** R/o 1/210-1, Sri Lakshmi Nagar, Chinna Chowk, Kadapa District, Andhra Pradesh-516002. ....**Certificate Debtors No.2**
3. **Sri Peddy Reddy Easwar Reddy, S/o Vasudeva Reddy,** R/o D.No. 3/374/4/1, Sastri Nagar Akkayapally, Kadapa District, Andhra Pradesh-516003. ....**Certificate Debtors No.3**
4. **Nagam Yella Reddy, S/o Sri Yella Reddy,** H.No. 1/210-1, Sri Lakhsmi Nagar Chinna Chowk, Kadapa-516002. ....**Legal Heirs of CD No.1**
5. **Nagam Swathi, D/o Sri Yella Reddy,** H.No. 1/210-1, Sri Lakhsmi Nagar Chinna Chowk, Kadapa-516002. ....**Legal Heirs of CD No.1**

(Legal Heirs/ Representatives of Late Smt. Nagam Gopalamma (Certificate Debtor No.1)

Whereas Certificate **RC. No. 524 of 2019 dated 12.07.2019** has been forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Officer Tribunal-2, Hyderabad in **OA 133 of 2019** to the undersigned for recovery of a sum of **Rs.53,11,460.39/- (Rupees Fifty Three Lakhs Eleven Thousand Four Hundred Sixty and Paise Thirty Nine Only) along with cost, expenses and future interest @ 13.85% p.a. from the date of filing of the O.A. i.e., 18.02.2019 till the date of realization in full, jointly and severally from the Certificate Debtors no 1 to 3.**

That an amount of **Rs. 53,11,460.39/- (Rupees Fifty Three Lakhs Eleven Thousand Four Hundred Sixty and Paise Thirty Nine Only)** is to be recovered from the Certificate Debtors along with interest and costs as above;

And whereas the said **Smt. Nagam Gopalamma (Certificate Debtor No.1)** has since died. You are hereby given notice that steps will be taken under all or any of the provisions of Recovery of Debts and Bankruptcy Act 1993 and the second schedule to the income tax Act, 1961 to recover the said amount from you together with the interest payable along with costs, charges and expenses incurred in respect of warrants and other processes issued and all other proceedings taken for realizing the specified amount, unless the amount of **Rs.53,11,460.39/- (Rupees Fifty Three Lakhs Eleven Thousand Four Hundred Sixty and Paise Thirty Nine Only)** and, the interest aforesaid along with costs, charges and expenses is paid by you within fifteen days from the date of service of this notice. The matter is next posted on **12.08.2025** for further proceedings.

GIVEN UNDER MY HAND AND THE SEAL OF THIS TRIBUNAL AT HYDERABAD ON THIS 08th DAY OF July, 2025.

Recovery Officer
Debts Recovery Tribunal Hyderabad (DRT 2)

శక్తియాప్ సేవలు వినియోగించుకోండి

కడప క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్ మహిళలు, బాలికలకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీం ఎస్ఐ శాంతమ్మ అన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత ప్రాధాన్యతపై మంగళవారం కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శక్తి టీం మహిళా ఎస్ఐ శాంతమ్మ, కడప తాలూకా ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోరు నుంచి ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎస్ఓఎస్ బటన్ , డయల్ 112 నెంబరు ద్వారా ఫిర్యాదు చేస్తే పది నిమిషాల్లో పోలీసులు వచ్చి ఆపద నుంచి తప్పిస్తారన్నారు. సైబర్ మోసాలపై డయల్ 100, 112, చైల్డ్‌లైన్ 1098, గృహ హింస 181, మహిళా వేధింపులు 1091, సైబర్ టోల్‌ఫ్రీ 1930, సైబర్ మిత్ర సంబంధిత పోలీసు వారికి తక్షణమే సంప్రదించిపోలీసులు అందించే సేవలు వినియోగించుకోవాలన్నారు.

విద్యాసంస్థలపై డ్రోన్ల నిఘా

శక్తి టీంల ఆధ్వర్యంలో నగరంలో కళాశాలలు, పాఠశాలల వద్ద బ అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై దృష్టిసారించారు. మహిళా పోలీసుస్టేషన్ సీఐ ఎల్లమరాజు, ఏహెచ్‌టీయూ ఎస్ఐ శాంతమ్మ, శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.


డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్న శక్తి టీం సభ్యులు

నేరాల నియంత్రణపై అవగాహన

పెండ్లిమర్రి:మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ని విద్యార్థులకు మంగళవారం నేరాల నియంత్రణ, మంచి స్పర్శ-చెడుస్పర్శ, పోక్సో చట్టం,ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై సీఐ ఈదురు బాషా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వాడాలన్నారు. శక్తియాప్ ఉపయోగాలు, అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్లు 112,181,1098,1930 లపై వివరించారు.

చీనీచెట్లకు ప్రాణం పోసిన వర్షం

వీరపునాయునిపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షం చీనీ తోటలకు ప్రాణం పోసింది. తేలికపాటి వర్షాలతో చీనీచెట్లు చిగురించాయి. ఈ వర్షంతో దుక్కులు బాగా వస్తాయని పలువురురైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూలై నెల ముగుస్తున్న సమయంలో తేలికపాటి వర్షాలు కురవడంతో బోరు బావుల కింద సాగు చేసుకోవచ్చని రైతులు అంటున్నా రు. వర్షాధారంగా ఖరీఫ్ పైరు సాగు చేసేందుకు అదును ముగియడంతో రైతులు రబీసాగుకు సిద్ధం కావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

కడప క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కొందరు మత్తుకు అలవాటుపడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకుంటున్నారని, సమాజంలోని ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలను విక్రయించే లేదా వినియోగించు వారి వివరాలను పోలీసు శాఖకు అందించి అలాంటి వారిలో మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈగల్ టీం ఆధ్వర్యంలో కడప నగరంలోని ఉర్దూ మున్సిపల్ హైస్కూలులో మంగళవారం యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ ఎవరైనా విక్రయిస్తుంటే ఈగల్ టోల్ ఫ్రీ నెం.1972 ద్వారా వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు కృషి చేస్తామని, డ్రగ్స్ విక్రేతల సమాచారం పోలీసులకు తెలుపుతామని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జ్ హెడ్‌మిసెస్ రహిమాబాను, ఈగల్ క్లబ్ అసిస్టెంట్ కోఆర్డినేటరు సాదిక్‌ఆలీ, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

సీకేదిన్నె : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని చింతకొమ్మదిన్నె ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడటం వలన విద్యార్థులు భవిష్యత్తునే కోల్పోతారన్నారు. మహిళలు చిన్నపిల్లలపై జరిగే నేరాలను ఏ విధంగా ఎదుర్కోవాలో వివరించారు. సెల్‌ఫోన్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని, తెలియని యాప్‌లను వాడి మోసానికి గురికావద్దన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అదే విధంగా సోషియల్‌మీడియా నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులు వారిపిల్లలకు నేరాలపై సెల్‌ఫోన్ వాడకంపై అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

కడప క్రైం, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సులు, ఆటోల రికార్డులు తప్పక కలిగి ఉండాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం నగరంలో ని ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఆవ రణలో రహదారి భద్రత నిబంధ నలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సీఐ జావీద్, ట్రాఫిక్ ఎస్ఐ జయరాముడు, వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

కడప కలెక్టరేట్, జూలై22,(ఆంధ్రజ్యోతి)మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సిఐ, డీకే జావీదు హెచ్చరించారు. మంగళవారం రాయల్ రషీద్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాయల్ కరీముల్లా ఆధ్వర్యంలో వినాయక నగర్ సర్కిల్, ఆటో స్టాండ్‌లో ఇందుకు సంబంధించిన స్టిక్కర్లను, పోస్టర్లను విడుదల చేశారు.


వేతనాల చెల్లింపులో జాప్యం తగదు: యూటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బదిలీల కారణంగా ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపులో ఆలస్యం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు హితవు పలికారు. మంగళవారం సాయంత్రం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2025 జూన్‌లో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు పొజిషన్ ఐడీలు రాకపోవడం తో వేతనాలు నిలిచి పోయాయని జీతాలు చెల్లించుటకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉర్దూ స్కూళ్ల పర్యవేక్షణకు అధికారులను నియమించండి

కడప ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఉర్దూ ఉప తనిఖీ అధికారి, ఉర్దూ అకడమిక్ మానిటరింగ్ అధికారి, ఎస్సీఈఆర్టీలో ఉర్దూ కోఆర్డినేటర్ పోస్టు భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఉర్దూ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడంతో పర్యవేక్షణకు, ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు, ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి ఆటంకం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మస్తాన్‌వలి, సిరాజ్, అఫ్జల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయంలో రాహుకాల పూజలు



కొలువుదీరిన విజయదుర్గాదేవి, రాహుకాల పూజలు చేస్తున్న మహిళలు

కడప కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం కాలసర్పదోష నివారణ రాహుకాల పూజలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాగా, ఈ నెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుండడంతో ప్రతి రోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు. కావున భక్తులు అమ్మవారిని దర్శించకుని తరించాలని కోరారు.

కృత్రిమ ఎరువుల వినియోగంతో భూములు నిస్సారం

పెండ్లిమర్రి, జులై 22 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులను విచక్షణా రహితంగా వినియోగిస్తే భూములు నిస్సారమవుతాయని మండల వ్యవసాయ అధికారి సుమంత్ రెడ్డి తెలిపారు. కొండూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువులు తప్పకుండా వేయాలన్నారు. వరి వేసిన రైతులు 20 రోజులకొకసారి ఎకరాకు 25కేజీల నుండి 30 కేజీల వరకు యూరియాను వాడితే సరిపోతుందన్నారు. ఐదు గురు కలిసి గ్రూపుగా వస్తే 80 శాతం సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్లు అందచేస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

చెన్నూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చేసిన కృషి మరువలేనిదని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చింతకుంట వాసుదేవరెడ్డి సర్పంచ్ సూర్యనారాయణ, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి రాంప్రసాద్ అన్నారు. మండలంలోని కొక్కిరాయపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శివకుమార్ బదిలీపై గోపవరం మండలానికి వెళ్లడంతో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ టీడీపీ నేతలు, ప్రజలు ఆయనను సన్మానించారు. టీడీపీ నేతలు శ్రీను, రాజు, రఘు, శ్యాంసుందర్, సందీప్ నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి రేణుకాదేవి పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగదు.

కడప మారుతీనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నా ఎదుగుదల చూసి ఓర్వలేకనే అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నానంటూ అసత్య ప్రచారం చేయడం తగదని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేశ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. పలు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లుగా చేసిన ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. అలా ఉంటే సాక్ష్యాధారాలతో నిరూపించాలని కోరారు. ఇటీవల కడపలో నిర్వహించిన మహానాడు సందర్భంగా అక్రమాలకు పాల్పడ్డానంటూ నిందలు మోపడం బాధాకరమన్నారు.

నేడు సింహాద్రిపురం మండల సమావేశం

సింహాద్రిపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో 23న, బుదవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు అందరూ హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీఓ శ్రీని వాసరెడ్డి తెలిపారు.

గౌరీదేవి బలిజ సంఘం అధ్యక్షుడిగా కుళ్లాయప్ప

వేంపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె గౌరీదేవి బలిజ సంఘం అధ్యక్షులుగా నంబూరుకుళాయప్ప, కంటిక చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం గౌరీదేవి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. వారు మాట్లాడుతూ రెండవ సారి కూడా తమను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని, సంఘం మెంబర్లకు, సభ్యులకు, గౌరవాధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి, సంఘం తరపున సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు

30 మందికి సూర్యనంది రకం కొర్రలు పంపిణీ

వేంపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 30 మందికిపైగా రైతులకు ఉచితంగా సూర్యనంది రకానికి చెందిన కొర్రలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలుగా కొర్రలు వేసుకోవడం ద్వారా రైతులు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాలు ఆరోగ్యవంతమైన జీవితంలో ముఖ్యభాగమని, చిరుధాన్యాలను ప్రకృతి వ్యవసాయం ద్వారా సులభ ంగా పండించవచ్చన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు వారు భారతీయ చిరుధాన్యాలపరిశోధన సంస్థ ద్వారాచిరుధాన్యాల సాగు పెంపొందించాలని సూచించారన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కె.సాయిమహేశ్వరి, డాక్టర్ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

వేంపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముతుకూరు గ్రామ సమీపంలో కోడిపందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. అందినసమాచారం మేరకు దాడులు చేసి నలుగురని అదుపులోక తీసుకొని ఐదు వాహనాలు, ఒక కోడి, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైన్ షాపులో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

ప్రొద్దుటూరు , జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో గల భూమిరెడ్డి వైన్ షాపులో ఎక్కువ ధర ఉండే మద్యం బాటిళ్లలో చీప్ లిక్కర్ కలిపి కల్తీ చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలపై స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారి మధుబాబు తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఎక్సైజ్ అధికారుల బృందం తనిఖీలు చేసి రెండు ఫుల్‌బాటిల్స్‌ను సీజ్ చేశారు. వాటిలో చీప్ లిక్కర్ కల్తీ జరిగిందా? లేదా? అని ల్యాబ్‌కు పంపి కల్తీ జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ సురేంద్ర తెలిపారు.

36 మద్యం బాటిళ్లు స్వాధీనం

దువ్వూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలోని మనేరాంపల్లె, ఇడమడక గ్రామాల్లో మంగళవారం మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 36 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మనేరాంపల్లిలో పల్లె రామిరెడ్డి, ఇడమడక గ్రామంలో ముద్దం రామమోహన్ అనే వ్యక్తులు బెల్టుషాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నట్లు చెప్పారు. వారిని అరెస్టు చేసి బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బి.మఠంలో 35 బాటిళ్లు ..

బ్రహ్మంగారిమఠం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని తెలుగుగంగ ప్రాజెక్టు రోడ్డులో ఓ బెల్టుషాపులో స్థానిక ఎస్ఐ శివప్రసాద్ వారి సిబ్బందితో తనిఖీలు చేసి 35 మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈతనిఖీలో ప్రసాద్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బహ్మంగారిమఠం మండలంలోని సొదరివారిపల్లె ఎస్సీ కాలనీ పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివ ప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.8500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాకిరేణిపల్లెలో అన్నీ సమస్యలే..!



డ్రైనేజీ కాలువల్లేక రోడ్డుపైనే నిలిచిన వర్షపునీరు

ప్రొద్దుటూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని శివారు ప్రాంతమైన కాకిరేణిపల్లె సమస్యలతో సతమతమవుతోంది. పేరుకే ఇది గ్రామ పంచాయతీ అయినా కనీస సౌకర్యాలు నోచుకోకపోవడం శోచనీయం. మండల పరిధిలోని కాకిరేణిపల్లె గ్రామంలో దాదాపు 250 ఇళ్లు ఉండగా వెయ్యి మంది కి పైగా జనాభా ఉన్నారు. ఇక్కడ తలెత్తే సమస్యలకు అధికారులు తూతూ మంత్రపు చర్యలు తప్పనిచ్చి గట్టి పరిష్కారమార్గాలు చూపకపోవడంతో నిత్యం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. గ్రామానికి ప్రధానంగా నీటి సరఫరా అయ్యే పైపులైను చౌడూరు-కాకిరేణిపల్లె మార్గమధ్యంలో పొలాల మధ్యలో లీకేజీలకు గురవుతూనే ఉంది. వర్షాకాలంలో తాగునీరు పైపు లీకేజీతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. గత నాలుగు నెలలుగా తరచూ ఇలాంటి సమస్య ఎదురవుతున్నప్పటికి పరిష్కార చర్యలు అధికారులు చూపడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. అసలు గ్రామ పంచాయతీ అధికారుల జాడ కనిపించడంలేదని కాకిరేణిపల్లె సచివాలయ సిబ్బంది చౌడూరు సచివాలయంలో ఉండడంతో ఇక్కడి సమస్యలపై దృష్టి కేంద్రీకరించేవారు కరువయ్యారని వాపోతున్నారు. సుమారు నెల రోజులుగా కాకిరేణిపల్లి ప్రధాన రహదారిలో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలుగక గ్రామం అంధకారంలో ఉంది. చీకటి పడగానే విషపురుగులు, కీటకాల సంచారంతో భయం గుప్పిట్లో ఉండాల్సి వస్తుందని చెబుతున్నారు. చినుకుపడితే గ్రామం మొత్తం చిత్తడిలా తయారవుతుందని పేర్కొన్నారు. మురుగు వ్యవస్థలేని ఈ గ్రామంలో వెయ్యి మంది జనాబాకు ఇద్దరు పారిశుధ్య కార్మికులు ఏ మేరకు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచగలరని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరిస్తాం

గ్రామానికి సరఫరా అయ్యే మంచినీటి పైపులైను లీకేజీ తమ దృష్టిలో ఉంది. మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. వెలుగని వీధి దీపాలను ఇటీవలే కొత్త బల్బులు అమర్చాం. గాలులు, వర్షాలధాటికి లూజ్ కాంట్రాక్టు వలన విద్యుత్తు సరఫరాలో సమస్య తలెత్తుతోంది. సంబంధిత అధికారులద్వారా తగిన చర్యలు తీసుకుంటాం.

- ఎం.రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోండి

ముద్దనూరు జూలై22(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ చంద్రానాయక్ పేర్కొన్నారు. మండలంలోని రాజులగురువాయపల్లె, కమ్మవారిపల్లె మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో రైతులు సాగు చేసిన పొద్దుతిరుగు పంటను జేడీఏ, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ అంకయ్యకుమార్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట బెట్టకు గురైందని ఆదుకోవాలని జేడీఏ కు విన్నవించారు. జేడీఏ స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. వందశాతం రాయితీతో కందులు, మినుములు, జొన్నలు, రాగులు విత్తనాలు బయోమెట్రిక్ పద్ధతిలో రైతులకు అందించనున్నట్లు తెలిపారు.

ఖరీఫ్‌లో ఈ- పంట నమోదు తప్పనిసరి

ఎర్రగుంట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఈ- పంట యాప్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ రైతులకు సూచనలిచ్చారు. మంగళవారం ఎర్రగుంట్ల మండలంలోని చిర్రాజుపల్లె రైతులతో ఆయన పొలంపిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాపాల్గొని ప్రసంగించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే మద్దతు ధర, పెట్టుబడి రాయితీ వంటి పథకాలు వర్తిస్తాయన్నారు.

ఆయిల్‌ఫాం సాగుతో మంచి దిగుబడి

మైలవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫాం సాగుతో మంచి దిగుబడితోపాటు ఆదాయం వస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం అధికారిణి మాధురి, జిల్లా వనరుల కేంద్రం పద్మజ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నకొమెర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆయిల్ ఫాం వంటనూనెల పంట మార్కెట్‌లో ఎప్పుడు డిమాండ్ ఉన్న పంట అన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి భరత్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి గురుభాస్కర్, రియాగోకుల్ ఆయిల్‌ఫాం కంపెనీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించండి

జమ్మలమడుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో యాజమాన్య పద్ధతులను అనుసరించాలని జిల్లా వనరుల కేంద్రం కడప వ్యవసాయాధికారిణి పద్మజ, వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం సున్నపురాళ్లపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వరి పంట బీమాకు ప్రీమియం మీసేవా కేంద్రాల్లో చెల్లించి పంటల బీమా చేసుకోవాలన్నారు. ఆగస్టు 15 వరకు గడువు ఉందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీతో డ్రోన్లు

మైదుకూరు రూరల్, జులై 22(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతుల సౌలభ్యం కోసం వ్యవసాయ డ్రోన్‌లను 80 శాతం సబ్సిడీతో ఇస్తోందని మండల వ్యవసాయాధికారి ఈబాల గంగాధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నంద్యాలంపేట పంచాయతీలోని వరదాయపల్లె, కొత్తపల్లెగ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

బ్రహ్మంగారిమఠం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం పల్లెపండుగ గ్రాంటు కింద మంజూరైన సీసీ రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈ మధుసూదన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా బదిలీపై వచ్చిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమై పనులు పూర్తి చేయాలని వారికి తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై చర్చ



మ్యాప్‌ను చూస్తున్న అధికారులు

ఎర్రగుంట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్ లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో మంగళవారం కమిషనర్ శేషఫణి అధ్యక్షతన అధికారులతో సమావేశమై ప్రత్యేకంగా చర్చించారు. 2021లో ప్రవేశపెట్టిన ఎర్రగుంట్ల డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్ అభ్యంతరాల రివ్యూ ఇటీవల విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ కార్యాలయంలో జరిగింది. దానికి సంబంధించి 440 అభ్యంతరాలను అక్కడ పరిశీలించారు. రోడ్డు వెడల్పు, వ్యవసాపొలాలను వ్యవసాయేతర పొలాలుగా చూపించిన వాటిపై సుమారు 3గంటల పాటు అక్కడ చర్చ జరిగింది. అభ్యంతరాల్లో 80శాతం ఆమోదిందించి మార్పులు చేసిన వాటిని పునః పరిశీలించమని ఎర్రగుంట్లకు పంపారు. మాస్టర్ ప్లాన్ గురించి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారుల అభిప్రాయాలను మంగళవారం జరిగిన సమావేశంలో సేకరించారు. కార్యక్రమంలో డిస్కం ఏడీఈ కిరణ్, ఏపిఎస్ఆర్టీసీ డీఎం, ఎంపీడీవో వెంకట రమణ, హౌసింగ్ ఏఈ రమాక్రిష్ణ, టీపీవో వెంకటరమణారెడ్డి, కమిషనర్ శేషఫణి, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం ధ్యేయం



రైతుకు సబ్సిడీ డ్రోన్‌ను అందజేస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి తెలిపారు. మండలంలోని ముచ్చుమర్రి, పి.అనంతపురం, రామిరెడ్డిపల్లె, బురుజుపల్లె, యనమలచింతల గ్రామాలలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం రాష్ట్రీయ కృషి యోజన పథకంలో భాగంగా ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందజేసే డ్రోన్‌ను భూపేశ్‌రెడ్డి బి.కొట్టాలపల్లెకు చెందని రైతు మహేశ్వరరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, ఏవో ఏవీ రామాంజులరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి నాయకులు రామసుబ్బారెడ్డి, చామల రామిరెడ్డి, పద్మజ, అరుణ్‌కుమార్‌రెడ్డి, అంకిరెడ్డి, రమేష్‌రెడ్డి, గోరిశెట్టిబాబు పాల్గొన్నారు.

అట్లూరులో: అట్లూరు మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి మండల టీడీపీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి పథకాలు అందుకున్న లబ్ధిదారులు వారి అభిప్రాయాలను వారికి తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులురెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, పాటూరు రాధా క్రిష్ణారెడ్డి, చిలిపి క్రిష్ణారెడ్డి, పెద్దరామ సుబ్బారెడ్డి, చిన్నరామసుబ్బారెడ్డి , జయక్రిష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, నరసింహారెడ్డి, నరసారెడ్డి, గంగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో :రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతో నియోజకవర్గ అభివృద్ధి పుట్టా సుధాకర్‌యాదవ్‌తోనే సాధ్యమని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ యాపరాల చిన్న అన్నారు. స్థానిక ప్రొద్దుటూరులో రోడ్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరగి సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈకార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ తుపాకుల రమణ,బూత్ ఇన్‌చార్జ్ దాసరి సత్య, శివసారధి, గణేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



ప్రజలకు సూచనలు ఇస్తున్న టీడీపీ నాయకులు

ఖాజీపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలని కొండపేట కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఉపచైర్మన్ నంద్యాల సుబ్బయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కూనవారిపల్లె, పుల్లూరు, కొత్తపేట, చెముళ్లపల్లె పంచాయతీలో బంగారు కుటుంబం పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బంగారు కుటుంబం పథకానికి గ్యాస్ లేనివారు, విద్యుత్తు కనెక్షన్ లేనివారు, ఆదాయం పన్ను కట్టనివారు, బ్యాంకు ఖాతాలేని కుటుంబాలు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు, టీడీపీ నాయకులు ఇరగంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, గోవిందు సుబ్బయ్య, ఫరూక్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గంగాధర్, క్రిష్ణారెడ్డి, వాకమల్ల వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి

పోరుమామిళ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు చాల మందిహెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు.

స్టూడెంట్ కిట్లకు బయోమెట్రిక్ తప్పనిసరి

కాశినాయన జూలై22(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం పాఠశాలలకు అందించిన స్టూడెంట్ కిట్లకు తప్పని సరిగా విద్యార్థుల చేత బయోమెట్రిక్ అథెంటికేషన్ వేయించాలని ఎంఈవో నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు బ్యాగులు,బూట్లు,షూలు, నోట్‌బుక్‌లు, బెల్ట్‌లు, డిక్షనరీలు అందజేశామన్నారు. ఎక్కడైనా కిట్లు మిగిలి ఉంటే ఎమ్మార్సీ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరగాలి

ఎర్రగుంట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా వైద్యులు చర్యలు తీసుకోవాలని డిప్యుటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత ఆదేశించారు. మంగళవారం ఎర్రగుంట్లలోని పీహెచ్‌సీని, అర్బన్ హెల్త్ సెంటర్‌నుఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు నిధులివ్వండి

● సీఎం చంద్రబాబును కోరిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి



సీఎం చంద్రబాబును కలిసిన కొండారెడ్డి

ప్రొద్దుటూరు జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్ ఇచ్చిన కట్టడాల తొలగింపునకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్రకార్యదర్శి నంద్యాల కొండారెడ్డి కోరారు. ఆమేరకు మంగళవారం రాజధాని అమరావతి లో సీఎం చంద్రబాబును కలిసి ప్రొద్దుటూరు అభివృద్ధిలో ప్రధానమైన కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.5.80 కోట్లు మంజూరయ్యాయని అలాగే స్థలాలు కోల్పోయే వారికి టీడీఆర్ బాండ్లు జారీకి అంగీకరించారని తెలిపారు. కేవలం రూ.13 కోట్లు విడుదలైతే ఆ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. అలాగే డ్రైనేజీ ఆధునీకరణ కూరగాయల మార్కెట్ ఆధునీకరణ, కుందూ-పెన్నా వరదకాలువ, అపెరల్‌పార్కు తదిత ర పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ఈసందర్భంగా చంద్రబాబు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోగ్యంపై కొండారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబును కలిసిన వారిలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, మాజీ జెడ్‌పిటీసీ సభ్యుడు తోట మహేశ్వరరెడ్డి, ధనియాల రాఘవరెడ్డి లువున్నారు.


ప్రొద్దుటూరు అభివృద్ధికి నిధులు ఇవ్వాలని వినతి



సీఎం చంద్రబాబును కలిసిన ప్రవీణ్‌కుమార్ రెడ్డి

ప్రొద్దుటూరు , జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు అభివృద్ధికి ఎన్నికలల్లో ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయాలని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. మంగళవారం రాజధాని అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును ప్రవీణ్‌రెడ్డి కలిసి నిధులు మంజూరుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రవీణ్ రెడ్డి నిలిచిపోయిన కూరగాయల మార్కెట్ కు నిధులు మంజూరు చేయాలని, తాగునీటి పైప్‌లైన్, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకీకరణకు, ఆర్టీపీపీ రోడ్డులోని పెన్నానదిపై నిర్మిస్తున్న హైలెవెల్ వంతెనకు నిధులు ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

హైదరాబాదు నుంచి స్వగ్రామం చేరిన ఎమ్మెల్యే వరద



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసిన కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు జూలై 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకోని చికిత్స అనంతరం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మంగళవారం స్వగ్రామం కామనూరుకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి ఆయన ఆరోగ్యం అడిగితెలుసుకున్నారు. అనంతరం మున్సిపాలిటీలో చేపట్టవలసిన పనులపై ఎమ్మెల్యే కమిషనర్ రవిచంద్రారెడ్డికి సూచనలు చేశారు. ముఖ్యంగా వర్షాకాలం వస్తున్నందున కాలువల్లో పూడిక తీత పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె విరమణ

● విధుల్లో చేరుతున్నట్లు ఈఈకి నోటీసు అందజేత



సమ్మెవిరమించినట్లు ప్రకటిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

ప్రొద్దుటూరు జూలై22 (ఆంధ్రజ్యోతి) : విధులు బహిష్కరించి గత 10 రోజులుగా సమ్మెబాట పట్టిన మున్సిపల్ ఇంజనీరింగ్ పారిశుధ్యకార్మికులు మంగళవారం సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఆమేరకు మున్సిపల్ ఈఈ శ్రీనివాసులకు విధుల్లో చేరుతున్నట్లు నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ పట్టణ కార్యదర్శి సాల్మన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో నెంబరు 36ను అమలు చేయకుండా కొత్తజీవో 124 ప్రకారం మూడు క్యాటగిరీల ఇంజనీరింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కేవలం మూడు వేలు మాత్రమే పెంచిందన్నారు. కార్మికులు ఈ జీతం పెంపుపై అసంతృప్తిగా ఉన్నారన్నారు. మంగళవారం విజయవాడలో కార్మిక సంఘాలనేతలతో జరిగిన చర్చల మేరకు మున్సిపల్ ఉన్నతాధికారులు కార్మికులు డిమాండ్లు అన్ని పరిష్కరించడానికి 10 రోజుల వ్యవధి కావాలని అప్పటి వరకు సమ్మె విరమించమని కోరడంతో తాత్కాలికంగా సమ్మె విరమించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, కార్యదర్శి వెంకటేష్, బీటెక్ శివ, మహేంద్ర, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఎన్ఎంయూ ధ్యేయం



మాట్లాడుతున్న పీవీ శివారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ఎన్ఎంయూ ధ్యేయమని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ శివారెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్ఎంయూఏ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఎంయూ కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి గోపాల్ డిపో వద్ద నుంచి 50 మంది కార్మికులతో ర్యాలీగా వచ్చి ఎన్ఎంయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలతో సత్కరించారు. డిపో నూతన కార్యవర్గ ఏర్పాటులో గోపాల్‌కు తగిన ప్రాధాన్యత కల్పించనున్నట్లు ఎన్ఎంయూ నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ఎంయూ రీజినల్ అధ్యక్షుడు నాగముని, రీజినల్ కార్యదర్శి సుధాకర్, డిపో కార్యదర్శి భానుప్రకాశ్, గ్యారేజీ కార్యదర్శి అశోక్, నారాయణ , జయచంద్ర, పీఆర్‌జీరెడ్డి, రాంబాబు, అయ్యవారప్ప, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

పోరుమామిళ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. మంగళవారం పోరుమామిళ్ల విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆగస్టు 7న చలో విజయవాడలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయల ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలన్నారు. 20, 21 సంవత్సరాలుగా పనిచేస్తున్నటు వంటి విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. సమావేశంలో మైదుకూరు డివిజను కార్యదర్శి పీసీ కొండయ్య, పోరుమామిళ్ల సబ్ డివిజను అధ్యక్ష కార్యదర్శులు నౌషాద్, మహబూబ్‌పీరా, విద్యుత్ కార్మికులు హుసేన్‌పీరా, వీరారెడ్డి, ఆదిలక్ష్మి, సలోమి పాల్గొన్నారు.

సోలార్ నిర్వాహకులు దౌర్జన్యం చేస్తున్నారు

జమ్మలమడుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలం కొండకల్వటాల ప్రాంతంలో రైతులపై సోలార్ ప్రాజెక్టు నిర్వాహకులు దౌర్జన్యం చేస్తున్నారని ప్రభుత్వం, జిల్లా అధికారులు వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి దౌర్జన్యంగా పొలాలు తీసుకుని ఏడాదికి లీజు పేరుతో రూ.30 వేలు ఇస్తామని మరికొందరి భూములను చెప్పాపెట్టకుండా పిల్లర్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, దేవగుడి చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్, దన్నవాడ మహేశ్వరరెడ్డి, గూడెం చెరువు నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్ట్

బద్వేలుటౌన్, జులై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్‌రోడ్డులో మట్కా ఆడుతుండగా వెల్లి బాలయ్య, నారాయణ అనే వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మట్కా ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి కేసు నమోదు చేశామన్నారు.